10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్


## తెలంగాణ రౌండప్

సోమవారం | 27 జనవరి 2025 | పేజీలు 8




ప్రభుత్వ పథకాల అమలులో అనర్హులను తొలగించి అర్హులను గుర్తించే బాధ్యతపై..! తెలంగాణ ప్రభుత్వ సలహాదారు సీనియర్ కాంగ్రెస్ నేత కె.కేశవరావు సంచలనాత్మక నిర్ణయాన్ని గ్రామస్తులకు సూచించారు.. నిజానికి అదే జరిగితే ప్రభుత్వ పథకాలు పక్కదారి పట్టకుండా.. అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే చేరుతాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు..వివిధ రాజకీయ పార్టీల నేతల సిఫార్సులతో..! గతంలో ఎన్నో ప్రభుత్వ పథకాలు పక్కదారి పట్టినవి కోకొల్లలు.. అందులో ముఖ్యంగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, దళిత బంధు, లాంటి పథకాలు కూడా పక్కదారి పట్టినట్లు తీవ్ర విమర్శలు వచ్చాయి.. ఈ నేపధ్యంలో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు వ్యాఖ్యలు ఆమోదయోగ్యంగా ఉన్నట్టు పలువురు భావిస్తున్నారు..

మేడ్చల్ జిల్లా బ్యూరో,
పెన్ పవర్, జనవరి 26:



# అర్హులను గుర్తించే బాధ్యత...
# ఆ గ్రామస్తులదే..!



-2లో

**4 పథకాల లబ్ధిదారుల ఎంపికపై.. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు నిర్ణయాత్మక సూచన..**

- గట్‌కేసర్ మండలం గణపూర్ గ్రామంలో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేశవరావు హాజరు..
- ఫ్లాగ్ షిప్ పథకాల ప్రత్యేక అధికారి శశాంక ఐఏఎస్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం హాజరయ్యారు..
- మీ గ్రామంలో అర్హులను మీరే గుర్తించాలి.. అర్హులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి..!
- అనర్హులను గుర్తించి అధికారులకు తెలియజేయాలని ప్రభుత్వ సలహాదారు కేశవరావు సూచన..

## దోచుకోవడం, దాచుకోవడం గత పాలకుల తీరు..
# సంపద సృష్టించడం మా తీరు





**హైదరాబాద్ పెన్ పవర్:**కొనిజర్ల మండలం చిన్నగోపతి బహిరంగ సభలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ది దోపిడీ ప్రభుత్వం, దొరల ప్రభుత్వం అని.. తమది ప్రజా ప్రభుత్వం, సంక్షేమ పథకాలు ప్రజలకు పంచే ప్రభుత్వమని అన్నారు. దోచుకోవడం, దాచుకోవడం గత పాలకుల తీరు అని.. సంపద సృష్టించడం, ప్రజలకు పంచడం తమ ప్రభుత్వ తీరు అని అన్నారు డిప్యూటీ సీఎం భట్టి. నాలుగు పథకాలే అనే చిన్న చూపు చూస్తున్నారని..

నాలుగు పథకాల అమలుకు సంవత్సరానికి 47 వేల కోట్ల రూపాయల నిధులు అవసరమని అన్నారు.ఇచ్చిన మాట నిలబెట్టుకునే

-8 లో

# రాష్ట్రాలపై కేంద్రం దండయాత్ర చేస్తోంది



**హైదరాబాద్ పెన్ పవర్:** వీసీల నియామకం యూజీసీ ద్వారా చేపట్టే యత్నం జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. డా.బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యూజీసీ ద్వారా కేంద్రం పెత్తనం చేసే ప్రయత్నం మంచిది కాదన్నారు. వర్సిటీల స్వయం ప్రతిపత్తి హరించాలని కేంద్రం చూస్తోందని చెప్పారు.

-8 లో

# అర్హులను గుర్తించే బాధ్యత.. ఆ గ్రామస్తులదే..!






## ఈ విడతలో పథకాలు అందనివాళ్ళు నిరాశ చెందవద్దు..

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందించే రైతు భరోసా, ఇందరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఈ నాలుగు సంక్షేమ పథకాలు నిరంతర ప్రక్రియగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.. ఈ విడతలో పథకాలురాని వారు నిరాశ చెందవద్దని, తరువాత కూడా అర్హులైన వారు ప్రజాపాలన కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవచ్చని, ఆ దరఖాస్తులను కూడా పరిగణలోకి తీసుకొని అందులో కూడా అర్హులైన వారికి తప్పకుండా సంక్షేమ పథకాలు అందిస్తామని ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు స్పష్టం చేశారు. అర్హులైన వారికి లబ్ది చేకూర్చే వరకు అధికారులు పనిచేస్తారని తెలిపారు..

- మొదటి పేజి తరువాయి

మీ గ్రామంలో అర్హులు ఎవరు..? అనర్హులు ఎవరు..? అనేది మీకంటే బాగా ఎవరికి తెలియదు..! అందుకే గ్రామ సభలు ఏర్పాటు చేసి, జాబితా నుండి అనర్హులను తొలగించి, అర్హులను గుర్తించే బాధ్యత గ్రామస్తులుగా, మీ పైనే ఉన్నదని ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు నిర్ణయాత్మక సూచన చేశారు.. అవును సిఫార్సులకి తావులేకుండా, ఆయా గ్రామాల్లో గ్రామ సభల్లో ఇలాంటి సాహసోపేత చర్యలు తీసుకుంటే ప్రభుత్వ పథకాలు నిజమైన, అర్హులైన లబ్ధిదారులకు చేరుతాయి.. మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండలంలోని ఘణపూర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి కేశవరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. ప్రభుత్వం అందించే ప్లాగ్‌షిప్ పథకాల లబ్దిదారులకు అందించే కార్యక్రమానికి..! ఫ్లాగ్ షిప్ పథకాల ప్రత్యేక అధికారి శశాంక ఐఏఎస్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ సలహాదారు కేశవరావును సాదరంగా ఆహ్వానించారు.హొ ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావుహొమాట్లాడుతూ మీ గ్రామంలో అర్హులను మీరే గుర్తించాలని సూచించారు.. అర్హులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని, అనర్హులను గుర్తించి అధికారులకు తెలియజేయాలని గ్రామస్తులను కోరారు.. ప్రజాస్వామ్య ప్రజా పాలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు




## ఆ నాలుగు పథకాలు ఆదివారం నుండి ప్రారంభం..

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 4 ప్లాగ్ షిప్ పథకాలు మంజూరు చేయడానికి ఆదివారం నుండి ప్రారంభమైందని అన్నారు. ఘణపూర్ గ్రామంలో ఆదివారం రైతు భరోసా 117 మందికి, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా 17 మందికి, ఇందిరమ్మ ఇళ్లు 117 మందికి, రేషన్ కార్డులు 176 మందికి మొత్తం 427 మంది అర్హులైన లబ్దిదారులకు ఈ మంజూరు పత్రాలు అందించడం జరుగుతుందని కలెక్టర్ గౌతమ్ తెలిపారు.. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయఅధికారి చంద్రకళ, జిల్లా పౌర సరఫరాల అధికారి సుగుణబాయి, డిఆర్డిఓ సాంబశివరావు, జిల్లా పరిశ్రమల అధికారి ప్రశాంత్, హౌజింగ్ ఈఈ రమణ మూర్తి, ఘట్కేసర్ తహసీల్దారు, ఎంపిడిఓ తదితరులు పాల్గొన్నారు.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ మండలంలో సోమారం గ్రామం..! షామీర్‌పేట్ మండలంలో పొన్నాల..! కీసర మండలంలో బోగారం..! మూడుచింతలపల్లిలో కేశవరం గ్రామాలలో ఆదివారంహొ4 ప్లాగ్ షిప్ పథకాలను ప్రారంభంచారు. కీసర మండలం బోగారంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడి అర్హులకు మంజూరు పత్రాలు అందజేసారు.

# సైఫ్ కేసుతో తన జీవితం నాశనం అయిందంటున్న డ్రైవర్

- ముంబయిలో నటుడు సైఫ్ అలీ ఖాన్ పై దాడి
- ఛత్తీస్ గఢ్ లో ఓ డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- అతడికేం సంబంధం లేదని ఆ తర్వాత వదిలేసిన వైనం
- కానీ తన ఉద్యోగం పోయిందంటున్న డ్రైవర్
- పెళ్లి కూడా క్యాన్సిల్ అయిందని ఆవేదన

హైదరాబాద్ పెన్ పవర్:బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ పై దాడి కేసులో తొలుత ముంబయి పోలీసులు ఛత్తీస్ గఢ్ లో ఒక అనుమానితుడ్ని అరెస్ట్ చేశారు. అతడి పేరు ఆకాశ్ కనోజియా. అతడు ఒక డ్రైవర్. సైఫ్ ఇంట్లో లభ్యమైన సీసీటీవీ ఫుటేజిలో ఉన్న వ్యక్తికి, ఆకాశ్ కనోజియాకు పోలికలు ఉండడంతో పోలీసులు అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. అతడికి ఈ కేసుతో సంబంధం లేదని నిర్ధారించుకుని ఆ తర్వాత వదిలేశారు. అంతవరకు బాగానే ఉంది. కానీ, సైఫ్ కేసులో తనను పోలీసులు అరెస్ట్ చేయడంతో తన జీవితం నాశనమైందని ఆ డ్రైవర్ తీవ్ర ఆవేదన వెలిబుచ్చాడు. "సైఫ్ కేసులో నన్ను ప్రధాన నిందితుడిగా భావించారు. మీడియాలో నా ఫొటోలు రావడం చూసి మా కుటుంబం తీవ్ర అవమానాలు ఎదుర్కొంది. నా పెళ్లి ఆగిపోయింది. కాబోయే భార్యను కలిసేందుకు వెళుతున్న నన్ను దుర్గ్ లో పోలీసులు అరెస్ట్ చేశారు... వారు నన్ను కొట్టారు.

పోలీసులు వదిలిపెట్టినా, అప్పటికే నాకు నష్టం జరిగింది. నా ఉద్యోగం పోయింది. నాతో పెళ్లి ఇష్టం లేదని అమ్మాయి కుటుంబ సభ్యులు చెప్పారు. పోలీసులు చేసిన తప్పుకు నేను మూల్యం చెల్లించాల్సి వస్తోంది. సీసీటీవీ ఫుటేజిలో కనిపించిన వ్యక్తికి మీసాలు లేవు...

నాకు ఉన్నాయి... పోలీసులు ఈ తేడా గుర్తించలేకపోయారు. అసలు నిందితుడు దొరకడంతో నేను బతికిపోయాను... లేకపోతే అన్యాయంగా నేను ఈ కేసులో ఇరుక్కుపోయేవాడిని. పోలీసులు చేసిన తప్పుకు నా జీవితం బలైంది" అని ఆకాశ్ కనోజియా వాపోయాడు. ఇక తాను సైఫ్ ఇంటి ముందు నిలబడి... తనను ఆదుకోవాలని, ఉద్యోగం ఇవ్వాలని వేడుకుంటానని ఆ డ్రైవర్ వెల్లడించాడు.

# మేడ్చల్ కలెక్టరేట్‌లో ఘనంగా గణతంత్ర దినోత్సవం వేడుకలు..





కలెక్టర్ గౌతమ్ పోట్రుకు మొక్కను అందజేసి ఆహ్వానిస్తున్న అదనపు కలెక్టర్

- జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు జాతీయ పతాకం ఆవిష్కరణ..
- కలెక్టర్ గౌతమ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు..
- డిసిపి కోటిరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్ రెడ్డి పాల్గొన్నారు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జనవరి 26:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సమీకృత కలెక్టరేట్ సముదాయంలో గణతంత్ర దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు.. ఈ 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు ముఖ్య అతిథిగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.. కార్యక్రమంలో వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి..అంతకుముందు కలెక్టర్ గౌతమ్ కి అదనపు కలెక్టర్‌లు, విజయేందర్ రెడ్డి(రెవెన్యూ), రాధికా గుప్తా (లోకల్‌బాడీ) పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు.. గౌతమ్ పోట్రు మాట్లాడుతూ మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ఎంతో ముందంజలో ఉందని మరింత ముందుకు తీసుకెళ్ళేందుకు అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయం, సహకారం ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు..

ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను శామీర్పేటలోని కలెక్టరేట్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గౌతమ్ ఉదయం 9 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.. కార్యక్రమంలో డిసిపి కోటిరెడ్డి , జిల్లా అదనపు కలెక్టర్‌లు విజయేందర్ రెడ్డి, రాధికా గుప్తా పాల్గొన్నారు.. అనంతరం గత సంవత్సర కాలంగా జిల్లా వ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి కలెక్టర్ తెలియజేశారు. జిల్లాను అన్ని రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్ళి అభివృద్ధిలో ముందుంచేందుకు కృషి చేయాలని అధికారులను కోరారు.. గణతంత్ర



దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జిల్లాలోని ఆయా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం ఉద్యోగ నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి కలెక్టర్ గౌతమ్ ప్రశంసాపత్రాలను అందచేశారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, విజయేందర్రెడ్డి, , జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, జిల్లా కలెక్టరేట్ ఏవో రాంమోహన్రావు, పోలీసు శాఖ ఉన్నతాధికారులు, ఆయా శాఖల జిల్లా అధికారులు, విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# 'కోయి.. కోయి.. కోడిని కోయ్..' అని పాడుకుంది చాలు.. ఈ పందెం కోడి వేలం పాట, సన్మానం ముచ్చట మస్తుందిగా..!

**హైదరాబాద్ పెన్ పవర్:**ఎన్నో వేలాలు జరుగుతుంటాయి. కానీ కోర్టులోనే వేలం పాట జరగడం ఎప్పుడైనా చూశారా..? కనీసం విన్నారా..? కానీ ఓ వ్యక్తి కోర్టులో జరిగిన వేలం పాటలో ఓ పందెం కోడిని దక్కించుకున్నాడు. అనుమతి లేకుండా కోడి పందేలు నిర్వహిస్తున్న ముఠాను పట్టుకున్న పోలీసులు ఈ నెల 25వ తేదీన అత్తాపూర్‌లోని ఉప్పరపల్లి కోర్టులో నిందితులతో పాటు పందెం కోడిని కూడా కోర్టులో ప్రవేశ పెట్టారు.అయితే నిందితులకు జరిమానా విధించడంతో పాటు కోడిని ఏం చేయాలనే ఆలోచనతో జడ్జి వేలం పాటకు ఆదేశించారు. వెంటనే ఆ వేలంలో పదుల సంఖ్యలో ఆసక్తి ఉన్న వారు పాల్గొన్నారు. అదే సమయంలో వేరే పనిపై కోర్టుకు వెళ్లిన తెలంగాణ రాష్ట్ర బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రామకృష్ణ వేలంలో పాల్గొని ఆ కోడిని 2,300లకు దక్కించుకున్నారు. బంజారాహిల్స్‌లో ఈ సందర్భంగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిన



అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్ కోడిని దక్కించుకున్నరామకృష్ణతో పాటు పందెం కోడిని సత్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. తనకు మూగ జీవాలు అంటే ఇష్టమని, ఎవరైనా ఈ కోడిని వేలంలో కొనుక్కుంటే ఎక్కడ చంపేసి తినాస్తారేమో అని భయమేసి తాను కూడా వేలంలో పాల్గొని కోడిని దక్కించుకున్నానని చెప్పారు. ఎంత రేటుకైనా దీనిని కొనుగోలు చేసేవాడినని తెలిపారు. తనకు ఫామ్ హౌజ్ ఉందని అక్కడ ఉన్న ఇతర జీవాలతో పాటు దీన్ని కూడా అల్లారుముద్దుగా పెంచుకుంటానని చెప్పుకొచ్చారు.

# సినీ నటుడు బాలకృష్ణ ఇంటికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. ఇందుకే వెళ్లారు..!





**హైదరాబాద్ పెన్ పవర్:**సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణను జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసానికి వెళ్లి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కలిశారు. కళా రంగంలో అందించిన సేవలకు గానూ పద్మభూషణ్ అవార్డుకు బాలకృష్ణ ఎంపిక కావడం పట్ల కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బాలకృష్ణను నేరుగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన పద్మభూషణ్ అవార్డును నందమూరి బాలకృష్ణకు ప్రకటించడంతో సినీ, రాజకీయ ప్రముఖులు ఆయనకు శు భాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం ఉదయం నుంచి బాలకృష్ణ నివాసం వద్ద అభిమానుల సందడి నెలకొంది.

నందమూరి బాలకృష్ణ నివాసం దగ్గర అభిమానుల కోలాహలం కారణంగా ఇబ్బంది తలెత్తకుండా ఉండటానికి కొందరు పోలీసులు కూడా అక్కడే ఉన్నారు. ఈ ఏడాది బాలకృష్ణతో పాటు సినీ రంగానికి చెందిన మరో ఐదుగురికి పద్మ భూషణ్ అవార్డు లభించింది. తమిళనాడు నుంచి హీరో అజిత్, నటి శోభన, కర్నాటక నుంచి నటుడు అనంత్ నాగ్, మహారాష్ట్ర నుంచి దర్శకుడు శేఖర్ కపూర్, ప్లే బ్యాక్ సింగర్ పంకజ్ ఉధాస్ (మరణానంతరం)ను పద్మ భూషణ్ వరించింది. పశ్చిమ బెంగాల్ నుంచి మ్యూ జిక్ కంపోజర్ అర్జిత్ సింగ్ కు పద్మశ్రీ లభించింది.కోలీవుడ్ అగ్రహీరోల్లో ఒకరిగా ఉన్న అజిత్ 1993లో 'అమరావతి' చిత్రంతో హీరోగా పరిచయమై, ఇప్పటివరకూ అరవైకి పైగా చిత్రాల్లో నటించారు. శివాజీ గణేషన్, రజినీకాంత్, కమల్ హాసన్, విజయ్ కాంత్ తర్వాత తమిళనాడు నుంచి పద్మ భూషణ్ అందుకున్న ఐదో నటుడిగా నిలిచారు. నటి శోభన స్వస్థలం కేరళ అయినప్పటికీ తమిళనాడు నుంచి అవార్డుకు ఎంపికయ్యారు. ఆమె1984లో హీరోయిన్‌గా మలయాళంలో ఎంట్రీ ఇచ్చారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, ఇంగ్లీష్ చిత్రాల్లో నటించారు. దేశవిదేశాల్లో ఎన్నో నృత్య ప్రదర్శలు ఇచ్చారు.

అనంత నాగ్ కన్నడతో పాటు తెలుగు, మలయాళ, మరాఠీ, హిందీ భాషల్లో 270కి పైగా సినిమాల్లో నటించారు. బాలీవుడ్ డైరెక్టర్ శేఖర్ కపూర్ 1983లో కల్ట్ క్లాసిక్ 'మసూమ్'తో దర్శకుడిగా ఎంట్రీ ఇచ్చారు. పూలన్ దేవి జీవితం ఆధారంగా తీసిన 'బాండిట్ క్వీన్ (1994)'తో అంతర్జాతీయ గుర్తింపు పొందారు. ఆయన తీసిన 'ఎలిజబెత్' సినిమా 7 విభాగాల్లో ఆస్కార్‌కు నామినేట్ అయింది.

# తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదం: రెయిలింగ్ ను ఢీకొని నుజ్జునుజ్జయిన కారు..





**హైదరాబాద్ పెన్ పవర్:**తిరుమల రెండవ ఘాట్ రోడ్డులో ప్రమాదం చోటు చేసుకుంది.. ఆదివారం ( జనవరి 26, 2025 ) జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి..తిరుమల రెండవ ఘాట్ రోడ్డులో ఓ కారు బ్రేక్ ఫెయిల్ అయ్యి రెయిలింగ్ ను ఢీకొనడంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జయ్యింది.. తిరుపతి నుండి తిరుమలకు వెలుతుండగా ఈ ఘటన చోటు చేసుకున్నట్లు సమాచారం. తిరుమలకు 6 కిలోమీటర్ల దూరంలో జరిగిన ఈ ప్రమాదంలో కర్ణాటకకు చెందిన నలుగురు భక్తులకు గాయాలయ్యాయి. కారు వేగంగా వెళ్లి రెయిలింగ్ ను డీకొనడంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జయ్యింది. అయితే, ఈ ప్రమాదంలో ప్రాణనష్టమేమి జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# పక్క రాష్ట్రానికి 5 ఇచ్చినప్పుడు మాకు కనీసం నాలుగైనా ఇవ్వాలి కదా?





**హైదరాబాద్ పెన్ పవర్:**పద్మ అవార్డుల్లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పక్క రాష్ట్రానికి (ఆంధ్రప్రదేశ్) 5 ఇచ్చినప్పుడు తమ రాష్ట్రానికి 4 ఇచ్చినా బాగుండేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు ప్రధాని మరో అన్యాయం చేశారని, దీనిపై త్వరలో లేఖ రాయనున్నట్లు తెలిపారు.

రాష్ట్రం నుంచి గద్దర్, గోరటి, జయధీర్ వంటి మేధావులు, ఉద్యమకారుల లిస్టును పంపామని, పరిగణనలోకి తీసుకోక పోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్మ అవార్డుల విషయంలో రాష్ట్రానికి అన్యాయం చేశారని అన్నారు. మంద కృష్ణకు అవార్డు ఇవ్వడం ఆహ్వానిస్తున్నామని.. అదేవిధంగా తాము పంపించిన లిస్టులను పరిగణలోకి తీసుకుని రాష్టరానికి పద్మ పురస్కారాలు ఇవ్వాల్సిందని అన్నారు.

# హైదరాబాద్ శ్రీచైతన్య కాలేజీ హాస్టల్స్‌లో ఉంటున్న విద్యార్థుల పరిస్థితేంటో ఇప్పుడు..!

హైదరాబాద్ పెన్ పవర్:హైదరాబాద్: మాదాపూర్‌లోని శ్రీచైతన్య విద్యా సంస్థలకు సంబంధించిన సెంట్రల్ కిచెన్ లైసెన్స్‌ను తెలంగాణ ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ రద్దు చేసింది. శుక్రవారం(జనవరి 24, 2025) ఈ కిచెన్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ కిచెన్ నుంచే గ్రేటర్ హైదరాబాద్‌లోని చైతన్య కాలేజీల హాస్టళ్లకు ఫుడ్ సరఫరా చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ఇక్కడ వండే భోజనాన్ని హాస్టళ్లలోని వేల మంది విద్యార్థులకు రోజూ అందజేస్తున్నారు.వేల మందికి భోజనాన్ని తయారు చేస్తున్న కిచెన్ అపరిశుభ్రంగా ఉండడంపై ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కిచెన్‌లో పాడైపోయిన ఆహార పదార్థాలు నిల్వ ఉన్నట్టు గుర్తించారు. సుమారు 125 కిలోల గడువు తీరిన ఆహార పదార్థాలను అధికారులు సీజ్ చేశారు. బియ్యం, కూరగాయలు, పప్పుదినుసులను అపరిశుభ్ర వాతావరణంలో స్టోర్ చేస్తున్నట్టు గుర్తించారు.

కిచెన్, స్టోర్ రూమ్‌లో బొద్దింకలు, ఎలుకలు




తిరుగుతున్నట్టు గుర్తించిన అధికారులు, కిచెన్‌ను సీజ్ చేయాలని, ఫుడ్ లైసెన్స్‌ను రద్దు చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. ఈ మేరకు అధికారులు మాదాపూర్(ఖానామెట్)లోని చైతన్య విద్యా సంస్థల సెంట్రల్ కిచెన్ లైసెన్స్‌ను రద్దు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. కిచెన్‌లో ఆహార తయారీని తక్షణమే నిలిపివేయాలని ఆదేశించారు. ఉత్తర్వులు ఉల్లంఘించి వంట తయారు చేస్తే, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# భగవంతుడిని ఎందుకు స్మరించాలి.. శ్రీకృష్ణుడు చెప్పిన సారాంశం ఇదే..

హైదరాబాద్ పెన్ పవర్:హిందువులు భగవంతుని నామం ఎప్పుడో ఒకప్పుడు తలుచుకుంటుంటారు. కొంతమంది నిత్యం భగవంతుని పూజిస్తే.. కొంతమంది వారానికొకసారి.. ఇంకొంతమంది పండగలకు.. పుణ్యదినాల్లో భగవంతుని జపిస్తూ పూజలు చేశారు. భగవంతుని నామం స్మరించినా, ఆ రూపాన్ని ధ్యానించినా శుభంకరం అని భావిస్తుంటారు. దీని విషయంలో శ్రీకృష్ణ పరమాత్ముడు ఏమన్నాడో తెలుసుకుందాం..

హిందువులందరూ భగవంతుడిని ధ్యానం చేస్తారు. అలా చేస్తే మన కోర్కెల చిట్టాలను ఆయనకు చెబుతూ.. స్వామి నా కష్టాలు తీర్చు..నా కోరికలు తీర్చు..అంటూ స్వామికి విన్నవించుకుంటారు. ఇలా భగవంతుని నామం జపిస్తూ... రూపం స్వామి అనుగ్రహం పొందడానికి పాటుపడతారు. భగవాన్.. నువ్వు అనేక నామాలను ఏర్పరచి, వాటిలో నీ సర్వశక్తులను నింపి ఉంచావు. వాటన్నింటిలో ఈశ్వరశక్తి నిండియుండడం చేత ఆ నామాలన్నీ మంత్రాలయ్యాయి. మననం చేసేవారిని కాపాడేది మంత్రం. అందుకే నామమే మంత్రం. ఆ నామశక్తిని రూపింపజేసేది రూపం అని తెలిపారు.భగవంతుడు నృసింహ, వామన, రామ, కృష్ణాది అవతార స్వరూపాలు సైతం పాంచభౌతికాలుగా గోచరించినా అవి 'అప్రాకృతదివ్యతనువులు'. ప్రకృతి వికారాలు లేనివి శివపురాణం ద్వారా తెలుస్తుంది. భావాన్ని ప్రకటించితే రూపంగా మారుతుంది. భగవంతుడు తన అనంత కళ్యాణ గుణాలను



రూపంద్వారా ప్రకటించుతాడు. ఈ అర్థంలో 'రూపు' శబ్దానికి 'ఆకారం' అనే కాక 'లీల' అని కూడా గ్రహించవచ్చు. భగవంతుని కృత్యాలు (ప్రకటనలు) లీలలు. అవి మనలను సన్మార్గంలో నడిపించడం.. మన కోర్కెలు తీర్చడానికి... లోక కల్యాణం కోసమే గానీ తన ప్రయోజనం కోసం కావు. భగవంతుని రూపాలన్నీ మనం కల్పించుకున్నవి కావు. ఋషులు తపస్సుతో దర్శించినవి. వారికి దర్శనం – ... మనకు ధ్యానం. వారికి విజ్ఞానం.. – మనకు విశ్వాసం. వారు దర్శించి వర్ణించినవే మనకు ధ్యానశ్లోకాలుగా మారాయని ఆధ్యాత్మిక గ్రంథాల ద్వారా తెలుస్తుంది. భగవంతుని రూపాన్ని హృదయంలో తలచుకున్నవారికి ఈశ్వర చైతన్యం వారి ప్రాణశక్తిలో సన్నిహితమై ఉండి, సర్వదా శుభాలను సమకూర్చుతుందని శ్రీకృష్ణుడు చెప్పాడని పండితులు చెబుతున్నారు. అందులో ఎలాంటి సందేహం లేదు. అందుకే పుణ్య క్షేత్రాలను సందర్శించడం... దేవుడి భజనలు.. ఊరేగింపులు..దేవుడి ఉత్సవాలు మొదలగు వాటిని నిర్వహించుకుంటున్నాము. భగవంతుని రూపాన్ని మనలో సన్నిహితం చేసేది నామస్మరణ మాత్రమే నని ఆధ్యాత్మిక వేత్తలు చెబుతున్నారు. భగవంతుని నామం స్మరించగానే ఒక రూపం స్ఫురిస్తుంది. భగవంతుడిని విగ్రహ రూపంలో గాని .. చిత్రపటం రూపంలోగాని పూజిస్తూ , కీర్తనలుగా స్తోత్రాలను చదువుతారు. స్వామి నామ జప, స్తోత్ర పఠనాలతో దేవతాస్వరూపం ఆవిష్కృతమై సాధకులు ఇహపరసిద్ధులు సాధిస్తారని పండితులు చెబుతున్నారు. పరమాత్ముని సాకార సగుణ రూపాలన్నీ శాశ్వతంగా ఉంటాయి. వాటికి ఎవరూ హాని చేయలేరు.. నాశనం చేయలేదు. భగవంతుని నామాలకు ప్రకృతి కూడా ఎలాంటి అపకారం చేయలేదు. అంటే ప్రకృతిని భగవంతుడి లొంగదీసుకొన్నాడు. సర్వసద్గుణములతో భగవంతుని నామాలు ఉన్నాయి. ఇవి అన్ని సర్వసుమంగళ సంపూర్ణములు.దివ్యమంగళవిగ్రహం, 'సచ్చిదానంద విగ్రహం'– అనే మాటలు దేవతా రూపాలను ఉద్దేశించి పలకడంలో ఆంతర్యం ఇదే. వేదం పలికిన 'కళ్యాణతమం' అనే వచనం .. ఇంత లోతైన భావాలను వ్యక్తం చేస్తోందని శ్రీకృష్ణుడు గీతలో చెప్పాడు.

## మంత్రి పొంగులేటి పర్యటనలో ఉద్రిక్తత: పోలీసుల లాఠీఛార్జ్..



హైదరాబాద్ పెన్ పవర్:జనగామ జిల్లాలో ఉద్రిక్తత చోటు చేసుకుంది.. మంత్రి పొంగులేటి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన సభ దగ్గరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి రావడంతో టెన్షన్ నెలకొంది. సభకు రాకుండా అక్రమంగా అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ పార్టీ నాయకులను సభకు అనుమతించాలని డీసీపీ రాజ మహేంద్ర నాయక్ ను కోరారు ఎమ్మెల్యే పల్లా. ఈ క్రమంలో జై కాంగ్రెస్, పల్లా గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు కాంగ్రెస్ కార్యకర్తలు.కాంగ్రెస్ కార్యకర్తలకు పోటీగా జై పల్లా అంటూ పోటాపోటీగా నినాదాలు చేశారు బీఆర్ఎస్ కార్యకర్తలు.దీంతో ఇరు వర్గాల మధ్య మాటల యుద్ధం మొదలైంది.ఈ క్రమంలో అక్కడే ఉన్న పోలీసులు ఇరు వర్గాలను చెదరగొడుతూ నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ పరిస్థితి కంట్రోల్ అవ్వకపోవడంతో లాఠీచార్జ్ చేశారు.

## రిపబ్లిక్ డే గూగుల్ స్పెషల్ డూడుల్.. ట్రెడిషనల్ డ్రెస్‌లో వన్యప్రాణుల పరేడ్



హైదరాబాద్ పెన్ పవర్: 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా గూగుల్ ప్రత్యేక డూడుల్ అందించింది. భారతీయ సాంప్రదాయ దుస్తులలో వన్యప్రాణుల కవాతుతో ఈ డూడుల్ ఆకట్టుకుం టోంది. పూణెకు చెందిన గెస్ట్ ఆర్టిస్ట్ రోహన్ దహోత్రే ఈ డూడుల్ ను రూపొందించారు. ఇది దేశ సాంప్రదాయాన్ని ప్రతిబింబించే దుస్తులలో వివిధ వన్యప్రాణులు కవాతు చేస్తున్నట్లు కనిపిస్తుంది. డూడుల్‌లో సాంప్రదాయ లడఖీ దుస్తులు ధరించిన మంచు చిరుత..ధోతీ–కుర్తా ధరించి సంగీత వాయిద్యాన్ని పట్టుకున్న పులి, విమానంలో నెమలి ఉన్నాయి. అంతేకాదు ఉత్సవ సిబ్బందిని మోస్తున్న జింక, భారతదేశంలోని వివిధ ప్రాంతాలను సూచించే ఇతర జంతువులు కూడా డూడుల్‌లో ఈ కనిపిస్తాయి.Google వెబ్‌సైట్‌లో ఈ డూడుల్ గురించి వివరించారు. ఈ డూడుల్ 76వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్న దేశ గౌరవం, ఐక్యతను చాటి చెబుతుందన్నారు.

# ప్రధాని మోదీకి కూడా మన శకటం నచ్చింది

### ఢిల్లీలో వేడుకగా రిపబ్లిక్ డే

### ఏపీ నుంచి ఏటికొప్పాక బొమ్మలతో కూడిన శకటం ప్రదర్శన


### మోదీ సహా ప్రముఖులందరూ మన శకటం పట్ల ఆసక్తిచూపారన్న చంద్రబాబు

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశ రాజధాని ఢిల్లీలో నేటి రిపబ్లిక్ డే వేడుకల్లో అందమైన ఏటికొప్పాక బొమ్మలతో కూడిన ఏపీ శకటం అందరినీ ఆకట్టుకుందని ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీకి కూడా మన శకటం నచ్చిందని అన్నారు. ఇతర ప్రముఖులు కూడా ఏపీ శకటం పట్ల ఆసక్తి ప్రదర్శించారని తెలిపారు. ఏటికొప్పాక బొమ్మలు కళాకారుల సృజనాత్మకతకు మారుపేరు అని చంద్రబాబు అభివర్ణించారు. ఏపీ శకటం రూపకల్పనలో భాగస్వాములైన ప్రతి ఒక్కరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని పేర్కొన్నారు.

### మహాకుంభమేళాలో స్వచ్ఛమైన గాలి..

# ఏర్పాట్లలో జపాన్ టెక్నిక్

- రెండేళ్ల క్రితమే మియవాకి టెక్నిక్ తో ప్రయాగ్ రాజ్ లో
- మొక్కలు నాటిన యోగి సర్కారు
- ప్రయాగ్ రాజ్ చుట్టుపక్కల ఏపుగా పెరిగిన చెట్లు
- 18 ఎకరాలలో ఏకంగా ఓ చిట్టడివి రూపుదిద్దుకుంది





**హైదరాబాద్ పెన్ పవర్:** మహాకుంభమేళా సందర్భంగా ప్రయాగ్ రాజ్ లోని త్రివేణి సంగమానికి భక్తులు పోటెత్తుతున్నారు. నిత్యం కోట్లాదిమంది భక్తులు వచ్చి పుణ్య స్నానం చేసి వెళుతున్నారు. కోట్లాదిమంది ఒక్కచోట చేరినా కూడా అక్కడ స్వచ్ఛమైన గాలి వీస్తుండడం విశేషం. అయితే, దీని వెనక ఉత్తరప్రదేశ్ సర్కారు రెండేళ్ల కృషి దాగి ఉంది. మహాకుంభమేళా కోసం రెండేళ్ల ముందు నుంచే ఏర్పాట్లు ప్రారంభించిన యూపీ ప్రభుత్వం.. గాలి నాణ్యతపై ప్రత్యేక దృష్టిపెట్టింది. కోట్లాది మంది భక్తులు వచ్చే ప్రాంతం కావడంతో స్వచ్ఛమైన గాలి లభించే మార్గాలను అన్వేషించింది. అందులో భాగంగా జపాన్ టెక్నిక్ 'మియవాకి'ను ఉపయోగించి మొక్కలు నాటారు. ప్రయాగ్ రాజ్ పరిధిలో పదిచోట్ల మొత్తం 18.50 ఎకరాల్లో ఏకంగా ఓ చిట్టడివినే తయారుచేసింది. తక్కువ ప్రదేశంలో వీలైనన్ని ఎక్కువ మొక్కలు నాటే టెక్నికే మియవాకి.. ఈ టెక్నిక్ తో మర్రి, రావి, వేప, చింత, ఉసిరి, రేగి, వెదురు.. ఇలా 63 రకాలకు చెందిన 5 లక్షలకు పైగా మొక్కలను అధికారులు నాటారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.6 కోట్లు ఖర్చుచేసింది. రెండేళ్లలో ఆ మొక్కలు చెట్లుగా ఎదిగి స్వచ్ఛమైన ఆక్సిజన్ ను వాతావరణంలోకి విడుదల చేస్తున్నాయి.

# ఏఐజీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డికి అరుదైన గౌరవం.. దేశంలో మూడు 'పద్మ' పురస్కారాలు అందుకున్న ఏకైక వైద్యుడిగా రికార్డ్

- నాగేశ్వరరావుకు ఇప్పటికే పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులు
- పెరోరల్ ఎండోస్కోపిక్ మయోటమీను పరిచయం చేసిన తొలి వైద్యుడిగా గుర్తింపు
- ప్రపంచ ఎండోస్కోపీ ఆర్గనేషేషన్‌కు తొలి భారతీయ అధ్యక్షుడిగా సేవలు
- కొవిడ్‌పై పోరులో నాగేశ్వరరావు బృందం అపార సేవలు




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లోని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ (ఏఐజీ) ఆసుపత్రి చైర్మన్, గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ దువ్వూరి నాగేశ్వరరెడ్డి దేశంలోనే అత్యంత అరుదైన రికార్డు సాధించారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆయనకు దేశంలోని రెండో అత్యున్నత పౌరపురస్కారమైన 'పద్మవిభూషణ్'ను ప్రకటించింది. ఇప్పటికే ఆయన 'పద్మశ్రీ', 'పద్మభూషణ్' అవార్డులు అందుకున్నారు. తాజాగా పద్మవిభూషణ్ కూడా రావడంతో మూడు పద్మ పురస్కారాలు అందుకున్న ఏకైక వైద్యుడిగా రికార్డులకెక్కారు. డాక్టర్ నాగేశ్వరరెడ్డిది విశాఖపట్నం. కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్, మద్రాస్ మెడికల్ కాలేజీలో ఎండీ, చండీగఢ్‌లోని పీజీఐఎంఈఆర్‌లో డీఎం పూర్తిచేశారు. హైదరాబాద్ నిమ్స్‌లో గ్యాస్ట్రో ఎంటరాలజీ నిపుణుడిగా సేవలు అందించిన ఆయన ఆ తర్వాత ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ ఆసుపత్రిని స్థాపించారు. వైద్యంలో సరికొత్త ఆవిష్కరణలు, విద్య, పరిశోధన, రోగుల సేవలకు తన జీవితాన్ని ఆయన అంకితం చేశారు.

ప్రస్తుతం ఏఐజీ ఆసుపత్రి 40 రకాల సేవలు అందిస్తోంది. పెరోరల్ ఎండోస్కోపిక్ మయోటమీ (పీవోఈఎం)ను పరిచయం చేసిన తొలి వైద్యుడిగా నాగేశ్వరరెడ్డి పేరు సంపాదించారు. ఎండోస్కోపీ పిత్తవాహిక చికిత్స కోసం ఉపయోగించేందుకు నాగిస్టంట్‌ను అభివృద్ధి చేశారు. ప్రపంచ ఎండోస్కోపీ ఆర్గనైజేషన్‌కు తొలి భారతీయ అధ్యక్షుడిగా పనిచేశారు. అలాగే, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవల కోసం ఏషియన్ హెల్త్‌కేర్ ఫౌండేషన్ (ఏహెచ్ఎఫ్)ను స్థాపించారు.

కరోనా సమయంలో డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, ఆయన బృందం వైరస్‌పై పోరాటంలో కీలకంగా వ్యవహరించింది. అలాగే, కొవిడ్-19 రోగుల్లో జీర్ణాశయాంతర సమస్యలపై చికిత్సలకు ప్రొటోకాల్‌ను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించారు. మాస్టర్ ఆఫ్ ది వరల్డ్ గ్యాస్ట్రోఎంటరాలజీ ఆర్గనైజేషన్ అవార్డు, జీర్ణాశయాంతర ఎండోస్కోపీ రంగంలో అత్యున్నత గౌరవమైన రుడాల్ఫ్ వి.షిండ్లర్ అవార్డులు అందుకున్నారు. నాగేశ్వరరెడ్డి భార్య క్యారల్ యాన్‌రెడ్డి డెర్మటాలజిస్ట్‌గా సేవలు అందిస్తున్నారు.

# బాత్రూమ్ లో కెమెరా పెట్టి రికార్డ్ చేశాడని యువకుడికి దేహశుద్ధి.. చివరకు తెలిసిందేంటంటే..?

- చితకబాది యువకుడిని పోలీసులకు అప్పగించిన మహిళ భర్త
- విచారణలో ఆ వీడియో రికార్డు చేసిందని భార్యేనని తేలడంతో అవాక్కైన పోలీసులు
- అక్రమ సంబంధం కప్పిపుచ్చుకోవడానికి యువకుడిపై నింద.. బెంగళూరులో ఘటన




**హైదరాబాద్ పెన్ పవర్:** పబ్లిక్ ప్లేసులు, హోటళ్లలో సీక్రెట్ కెమెరాలు పెట్టి మహిళలను నగ్నంగా రికార్డు చేస్తున్న ఘటనలు ఇటీవల పెరిగిపోతున్నాయి. ఆ వీడియోలు నెట్ లో ప్రత్యక్షం కావడంతో బాధితులు నరకం అనుభవిస్తున్నారు. తీవ్ర మనోవేదనకు లోనవుతున్నారు. దీంతో పోలీసులు కఠినంగా వ్యవహరిస్తూ నిందితులను పట్టుకుని కటకటాల వెనక్కిపంపిస్తున్నారు. తాజాగా బెంగళూరులో ఇలాంటి సంఘటన ఒకటి చోటు చేసుకుంది. సీక్రెట్ కెమెరా సాయంతో తన భార్యను నగ్నంగా వీడియో తీశాడని ఆరోపిస్తూ ఓ యువకుడిపై భర్త దాడి చేశాడు. తప్పించుకుని పారిపోతుంటే వెంటపడి మరీ పట్టుకున్నాడు. స్నేహితులతో కలిసి ఆ యువకుడిని చితకబాది పోలీసులకు అప్పగించాడు. అయితే, విచారణలో అసలు విషయం బయటపడడంతో ఆ భర్తతో పాటు పోలీసులు కూడా అవాక్కయ్యారు.

అసలు ఏం జరిగిందని పోలీసులు ప్రశ్నించగా.. ఆ యువకుడు గీజర్ రిపేర్ పేరుతో తమ ఇంట్లోకి వచ్చాడని, రిపేర్ చేస్తూనే గీజర్ లో సీక్రెట్ కెమెరా అమర్చాడని భర్త చెప్పాడు. తన భార్య స్నానం చేస్తుండగా రికార్డు చేసి ఆ వీడియోను నెట్ లో పెట్టాడని ఆరోపించాడు. అయితే, గీజర్ ఆన్ చేసిన తర్వాత బాగా వేడెక్కుతుందని, అందులో కెమెరా పెట్టే అవకాశమే లేదని పోలీసులు అనుమానించారు. దీనిపై బాధితురాలిని గట్టిగా నిలదీయగా అసలు విషయం వెల్లడించింది. ఆ వీడియో తీసింది తానేనని బయటపెట్టింది. తనను తాను నగ్నంగా వీడియో తీసుకుని ఆ యువకుడికి పంపానని చెప్పింది. ఆ యువకుడితో తనకు వివాహేతర సంబంధం ఉందని, అతడు కోరడంతో వీడియో తీసుకుని పంపించానని తెలిపింది. ఆ వీడియో చూసి భర్త నిలదీయడంతో తప్పించుకోవడానికి అబద్ధం చెప్పానని బాధితురాలు వివరించింది.

# గూగుల్ క్రోమ్ వాడే విండోస్, మాక్ యూజర్లకు కేంద్రం హెచ్చరిక

- గూగుల్ క్రోమ్ లో రెండు తీవ్ర లోపాలు ఉన్నాయన్న సీఈఆర్టీ
- వెంటనే లేటెస్ట్ వెర్షన్ కు అప్ డేట్ చేసుకోవాలని సూచన
- లేకుంటే హ్యాకర్లు పంజా విసిరే అవకాశం ఉంటుందని వెల్లడి




**హైదరాబాద్ పెన్ పవర్:**గూగుల్ క్రోమ్ సెర్చ్ ఇంజిన్ బ్రౌజర్ ను ఉపయోగించే విండోస్, మాక్ యూజర్లకు కేంద్ర ప్రభుత్వం అధీనంలోని కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (%జజు=%) హెచ్చరిక జారీ చేసింది. గూగల్ క్రోమ్ లో రెండు తీవ్రస్థాయిలో లోపాలు ఉన్నాయని, ఇవి హ్యాకర్లకు అవకాశాలుగా మారతాయని సీఈఆర్టీ స్పష్టం చేసింది. పీసీలు, ల్యాప్ టాప్ ల్లో విండోస్ ఓఎస్ వాడేవారికి, మాక్ యూజర్లకు ఈ హెచ్చరిక వర్తిస్తుందని తెలిపింది. స్మార్ట్ ఫోన్ యూజర్లకు దీనివల్ల ఏమంత నష్టం ఉండకపోవచ్చని సీఈఆర్టీ పేర్కొంది.

గూగుల్ క్రోమ్ లోని ఈ లోపాల కారణంగా ఆయా డివైస్ లు హ్యాకర్ల అధీనంలోకి వెళ్లిపోతాయని, వాటిలోని సమాచారం హ్యాకర్ల పరమవుతుందని వివరించింది. ఈ నష్టాన్ని నివారించాలంటే వెంటనే విండోస్, మాక్ యూజర్లు తమ గూగుల్ క్రోమ్ బ్రౌజర్ ను లేటెస్ట్ వెర్షన్ కు అప్ డేట్ చేసుకోవాలని సీఈఆర్టీ స్పష్టం చేసింది. క్రోమ్ కు సెక్యూరిటీ ప్యాచ్ లు వస్తే, అప్ డేట్ చేసుకోవాలని సూచించింది. విండోస్, మాక్ యూజర్లు తమ డివైస్ లలో 132.0.6834.83/8%తీ%, 132.0.6834.110/111కు ముందు వెర్షన్ల గూగుల్ క్రోమ్ ను వాడుతున్నట్టయితే వెంటనే అప్ డేట్ చేసుకోవాలని సీఈఆర్టీ తెలిపింది. ఇక, ఓపెన్ సోర్స్ ఆపరేటింగ్ సిస్టమ్ లినక్స్ యూజర్లు... 132.0.6834.110 వెర్షన్ కు ముందు గూగుల్ క్రోమ్ ను వాడుతున్నట్టయితే వారు కూడా లేటెస్ట్ వెర్షన్ కు అప్ డేట్ చేసుకోవాలని వెల్లడించింది.

# హైవే కోసం ఇంటిని 2 కోట్లకు అమ్మేయమని అడిగిన ప్రభుత్వం.. కుదరదన్న ఇంటి ఓనర్.. నెక్స్ట్ జరిగింది ఇది..!



**హైదరాబాద్ పెన్ పవర్:**బీజింగ్: రోడ్డు విస్తరణల సమయంలో, కొత్తగా హైవేలు నిర్మించే సందర్భంలో కొన్ని ఇళ్లను, షాపులను కూలగొడుతుంటారు. బాధితులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి మరోచోట వారికి పునరావాసం కల్పిస్తుంటుంది. కొన్ని సందర్భాల్లో కేవలం పరిహారం మాత్రమే చెల్లిస్తుంటుంది. చైనాలో కూడా అక్కడి ప్రభుత్వం ఇటీవల ఒక హైవే నిర్మాణానికి సంకల్పించింది. ఆ సందర్భంగా ఒక పెద్దాయన ఇంటిని కూడా కూల్చేయాల్సిన పరిస్థితి ప్రభుత్వానికి వచ్చింది. ¥180,000(2 కోట్ల రూపాయలు మన కరెన్సీలో) పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. కానీ ఆ వృద్ధుడు తన ఇంటికి ఇంకా ఎక్కువ డబ్బు ఆశించి ప్రభుత్వ ప్రతిపాదనకు అంగీకరించలేదు. బెట్టు చేస్తే ప్రభుత్వం మెట్టు దిగొస్తుందని సదరు వృద్ధుడు దురాశకు పోయాడు. దురాశ దు:ఖానికి చేటనే విషయాన్ని గుర్తించలేకపోయాడు. ఇప్పుడు రెంటికీ చెడ్డ రేవడిలా అతని పరిస్థితి తయారైంది. అసలేం జరిగిందంటే.. చైనాలోని షాంగై సమీపంలోని జింగ్సీ పట్టణంలో హాంగ్ పింగ్ అనే వృద్ధుడికి రోడ్డు పక్కనే ఇల్లు ఉంది. హైవే నిర్మించడం కోసం ప్రభుత్వం ఆ ఇంటిని కూలగొట్టాలని డిసైడ్ అయింది. 2 కోట్ల పరిహారం ఆఫర్ చేసింది. మరింత డబ్బు ఆశించిన హాంగ్ పింగ్ గవర్నమెంట్ ప్రపోజల్ కు ఒప్పుకోకపోవడంతో చైనా ప్రభుత్వం అతనికి పెద్ద ఝలకే ఇచ్చింది. అతని ఇంటికి ఎలాంటి నష్టం జరగకుండా ఇంటి చుట్టూ హైవేను నిర్మించింది. ఇప్పుడు ఆ వృద్ధుడి ఇల్లు హైవే మధ్యలో ఉంది.

'నిద్ర లేదు.. సుఖం లేదు.. దెబ్బ మీద దెబ్బ' అన్నట్టుగా ఆ వృద్ధుడి పరిస్థితి తయారైంది. హైవే మధ్యలో తన ఇల్లు ఉండటంతో నిత్యం వాహనాల రణగొణ ధ్వనులతో ఆ వృద్ధుడికి, అతని కుటుంబానికి కంటి మీద కునుకు లేకుండా పోయింది. అంతేకాదు.. అతని ఇంటికి వెళ్లాలన్నా, ఆ ఇంట్లో నుంచి బయటకు వెళ్లాలన్నా హైవే నిర్మాణంలో భాగంగా నిర్మించిన ఒక టన్నెల్ లోపల నుంచి వెళ్లాల్సిన పరిస్థితి.

ప్రభుత్వం 2 కోట్లు ఇస్తానంటే ఒప్పుకోనందుకు ఈ వృద్ధుడు భారీ మూల్యమే చెల్లించుకోవాల్సి వచ్చింది. అప్పుడే అమ్ముకుని ఉంటే బాగుండేదని ఇప్పుడు సదరు ఇంటి యజమాని నిట్టూరుస్తున్నాడు. ఆ ఇంట్లో వృద్ధుడితో పాటు అతని భార్య, 11 ఏళ్ల వయసున్న ఆయన మనవడు కూడా ఉంటున్నారు.

హైవే మధ్యలో ఇల్లు ఉండటం, ఆ ఇంటికి వెళ్లాలంటే టన్నెల్ లోపల నుంచి వెళ్లాల్సి ఉండటంతో ఇదెక్కడి వింత ఇల్లంటూ హాంగ్ పింగ్ ఇంటిని చూసేందుకు టూరిస్టులు క్యూ కడుతున్నారు. అలా వచ్చిన టూరిస్టుల నుంచి డబ్బు వసూలు చేసి పోగొట్టుకున్న 2 కోట్లలో కొంతైనా సంపాదించుకోవాలని హాంగ్ పింగ్ భావిస్తున్నాడని తెలిసింది. డబ్బును కొంతైనా తిరిగి పొందగలుగుతాడేమో గానీ ప్రశాంతతను, నిద్రను కొనలేడుగా. ఆ ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవడం తప్ప హాంగ్ పింగ్ కుటుంబానికి మరో మార్గం లేదు. అందుకే అంటారు.. ఆలస్యం.. అమృతం.. విషం అని.

## కోట్లకు ఆశపడి క్షుద్రపూజలు ప్లాన్ చేశాడు.. చివరికి ఏమైందంటే..



**హైదరాబాద్ పెన్ పవర్:**కోట్లలో డబ్బుల వర్షం కురిపిస్తానని ఓ కేటుగాడు చెప్పిన మాటలు నమ్మి రూ. 2 లక్షలు సమర్పించుకొని మోసపోయాడు ఓ ప్రబుద్ధుడు. మంచిర్యాలలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి.. మంచిర్యాల పట్టణానికి చెందిన మాదంశెట్టి ప్రభంజన్ అనే వ్యక్తి కి క్షుద్రపూజలు చేస్తే కోట్లలో డబ్బులు వస్తాయని చెప్పి నమ్మించారు మోసగాళ్లు. మాయ మాటలు చెప్పి బాధితుడి నుండి 2 లక్షలు రూపాయలు వసూలు చేశారు ముఠా సభ్యులు. అమాయకుడి నుండి డబ్బు వసూలు చేసిన ముఠా క్షుద్రపూజల సెటప్ అంతా సిద్ధం చేసి శుక్రవారం ( జనవరి 24, 2025 ) రాత్రి 11 గంటల సమయంలో క్షుద్రపూజ మొదలుపెట్టారు. అయితే.. ఏమైందో ఏమో కానీ బాధితుడు ప్రభంజన్ కి పూజ మధ్యలో కేటుగాళ్లపై అనుమానం వచ్చింది.. తన రెండు లక్షల డబ్బులు తీసుకొని అక్కడి నుండి పారిపోవాలని అనుకున్నాడు.కాగా.. డబ్బుతో పారిపోవడానికి ప్రయత్నిస్తున్న ప్రభంజన్ ను ముఠా సభ్యులు అడ్డుకొని చంపుతామని బెదిరించి డబ్బు లాక్కున్నారు.ముఠా సబ్యులకు డబ్బులు ఇచ్చేసి అక్కడి నుండి పారిపోయిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు నలుగురు ముఠా సభ్యులను అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నారు పోలీసులు.

## సైఫ్ అలీఖాన్ మెడిక్లైయిమ్ ను వ్యతిరేకించిన డాక్టర్ల సంఘం.. ఏమైందంటే..



**హైదరాబాద్ పెన్ పవర్:**కత్తి పోట్లతో ఆస్పత్రిలో చేరిన బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీఖాన్ మెడికల్ క్లయిమ్ వ్యవహారం హాట్ టాపిక్ మారిన సంగతి తెలిసిందే.. ఈ అంశంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్న క్రమంలో ముంబైకి చెందిన డాక్టర్ల సంఘం కూడా సైఫ్ అలీఖాన్ మెడిక్లైయిమ్ ను వ్యతిరేకిస్తూ ఐఆర్డీఏ కి లేఖ రాయటం చర్చనీయాంశం అయ్యింది. సైఫ్ 25 లక్షల రూపాయల మెడికల్ ఇన్సురెన్స్ క్లైయిమ్ చేసుకోవటం వ్యతిరేకించింది ముంబైకి చెందిన అసోసియేషన్ ఆఫ్ మెడికల్ కన్సల్టెంట్స్ . సైఫ్ కి అంత పెద్ద మొత్తంలో మెడిక్లైయిమ్ ఇవ్వటం, అందులోనూ అంత త్వరగా ఎలా క్లెయిమ్ మంజూరు చేస్తారంటూ అభ్యంతరం వ్యక్తం చేసింది.

సామాన్యులకు క్లెయిమ్స్ మంజూరు చేయటంలో ఆలస్యం చేసే ఇన్సూరెన్స్ కంపెనీలు సైఫ్ కి మెరుపు వేగంతో క్లెయిమ్ మంజూరు చేయటం వెనక కారణం ఏంటని ప్రశ్నించింది ఏఎంసీ. ఇదిలా ఉండగా... సెలబ్రిటీ కాబట్టి ఇన్సురెన్స్ కంపెనీలు వెంటనే క్లెయిమ్ రిలీజ్ చేస్తాయి. అదే ఒక కామన్ మ్యాన్ కు అయితే కంపెనీలు ఇంత ఈజీగా క్లెయిమ్ చేసిన మొత్తాన్ని ఇస్తాయా నెటిజన్లు కూడా పెద్ద ఎత్తున కామెంట్ చేస్తున్నారు.అయితే.. సైఫ్ మెడిక్లైయిమ్ మంజూరు చేసిన ఇన్సూరెన్స్ కంపెనీ నివా భూపా ఈ అంశంపై స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. పేషేంట్ జాయిన్ అయ్యే హాస్పిటల్, తీసుకునే ట్రీట్మెంట్, అడ్మిట్ ఐయ్యే రూమ్ ని బట్టి కూడా క్లెయిమ్ అమౌంట్ మారుతుందని స్పష్టం చేసింది.

# గుండెపోటుతో ప్రముఖ డైరెక్టర్ మృతి.

**హైదరాబాద్ పెన్ పవర్:**మలయాళ ప్రముఖ డైరెక్టర్ షఫీ గుండెపోటుతో మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న డైరెక్టర్ షఫీ కేరళలో ఉన్నటువంటి ఓ ప్రముఖ ఆసుపత్రిలో ట్రీట్ మెంట్ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో గతవారం షఫీ కి హార్ట్ స్ట్రోక్ వచ్చింది. దీంతో అప్పటినుంచి ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. కానీ మరోసారి ఈరోజు గుండెపోతూ రావడంతో పరిస్థితి చేజారి మరణించాడు. ఈ విషయాన్ని డైరెక్టర్ షఫీ కుటుంబ సభ్యులు సోషల్ మీడియా వేదికగా తెలిపారు. దీంతో పలువురు అభిమానులు, సన్నహితులు సంతాపం తెలియజేస్తున్నారు.

ఇక డైరెక్టర్ షఫీ కెరీర్ విషయానికొస్తే 1995 లో మలయాళ స్టార్ హీరో జయరామ్ హీరోగా నటించిన ఆద్యతే కన్మణి అనే సినిమాకి దర్శకత్వం వహించి కెరీర్ మొదలు పెట్టాడు. ఈ క్రమంలో దాదాపుగా 50కి పైగా సినిమాలకి దర్శకత్వం, స్క్రీన్ ప్లే అందించాడు. షఫీ దర్శకత్వం వహించిన పులివల్ కళ్యాణం, తొమ్మనమ్ ముక్కలుల్, కళ్యాణరామన్, టూ కంట్రీస్, చిల్డ్రన్ పార్క్, షెర్లాక్ టోమ్స్ తదితర సినిమాలు సూపర్ హిట్ అయ్యాయి. చివరిగా షఫీ దర్శకత్వం వహించిన ఆనందం పరమానందం సినిమా 2022లో రిలీజ్ అయ్యింది. కానీ ఈ సినిమా ఆశించిన స్థాయిలో ఆడియన్స్ ని అలరించలేకపోయింది.

## దోచుకోవడం, దాచుకోవడం గత పాలకుల తీరు.. సంపద సృష్టించడం మా తీరు

- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వం ఇందిరమ్మ ప్రభుత్వమని అన్నారు.

కేంద్రంలో ఉన్న బిజెపి రాజ్యాంగాన్ని మార్చాలని మత రాజకీయాలు చేస్తోందని.. బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా బిజెపితో జతకట్టి రాజకీయాలు చేసిందని అన్నారు భట్టి. గత పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేని చేతగాని ప్రభుత్వం టిఆర్ఎస్ ప్రభుత్వమని.. కావాలనే కొందరు టిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు భట్టి.ముఖ్యమంత్రి నుండి క్యాబినెట్ లో ఉన్న మంత్రులంతా పేద ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తున్నామని అన్నారు భట్టి.

## రాష్ట్రాలపై కేంద్రం దండయాత్ర చేస్తోంది

- మొదటి పేజి తరువాయి

**"వర్సిటీలపై రాష్ట్ర హక్కును కేంద్రం ఎలా తీసుకుంటుంది. కేంద్రం కుట్రలను ఎలాగైనా అడ్డుకోవాల్సిందే. ఇతర సీఎంలతో కలిసి యూజీసీ నిబంధనలపై పోరాడతాం. యూజీసీ కొత్త నిబంధనలు రాజ్యాంగంపై దాడి వంటివే. రాష్ట్రాలపై కేంద్రం దండయాత్ర చేస్తోంది. ఇలాంటి విధానాలతో రాజ్యాంగం మనుగడ సాగిస్తుందా? అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలోనే అధికార విభజన ఉంది. కేంద్రం తక్షణమే యూజీసీ నిబంధనలు ఉపసంహరించుకోవాలి. కేంద్రం ఒక్కొక్కటిగా రాష్ట్రాల హక్కులు గుంజుకుంటే ఎలా? తీరు ఇలాగే ఉంటే.. రాష్ట్రాలు నామమాత్రం అవుతాయి.**

పద్మ అవార్డుల విషయంలో తెలంగాణపై వివక్ష చూపింది. రాష్ట్రం సిఫార్సు చేసిన వారికి పురస్కారాలు ఇవ్వలేదు. గద్దర్, చుక్కా రామయ్య, అందెశ్రీ, గోరటి వెంకన్న, జయధీర్ తిరుమలరావు పేర్లు సిఫార్సు చేశాం. ఏపీకి ఐదు అవార్డులు ఇచ్చారు.. మనకు నాలుగైనా ఇవ్వలేదు. ఈ వివక్షపై కేంద్రానికి లేఖ రాస్తా. మందకృష్ణకు పద్మశ్రీ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నాం. ప్రొఫెసర్ల వయోపరిమితి 65కు పెంచే ఆలోచన ఉంది" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

# విమానంలో కొట్టుకున్న ప్యాసింజర్లు.. బాంబుతో పేల్చేస్తామంటూ బెదిరింపులు


**హైదరాబాద్ పెన్ పవర్:**ఇండిగో విమానంలో ఇద్దరు ప్యాసింజర్లు కొట్టుకున్నారు. సీటు విషయంలో వచ్చిన గొడవ ముదిరి ఒకరిపై ఒకరు పిడిగుద్దులతో విరుచుకుపడ్డారు..అంతేకాదు.. నా దగ్గర బాంబు ఉంది.. పేల్చేస్తాను.. జాగ్రత్త అంటూ ఒకరినొకరు బెదిరించుకున్నారు.విమానం లో గాల్లో ఉండగానే ఇదంతా జరగడంతో తోటి ప్రయాణికులు భయంతో వణికిపోయారు. చివరి విమానాశ్రయంలో ల్యాండ్ అయిన తర్వాత సెక్యూరిటీ అధికారులు చెకింగ్ చేసి బాంబు లేదు ఏదీ లేదు అని నిర్ధారణ కావడంతో ప్యాసింటర్లు ఊపిరి పీల్చుకున్నారు.

శనివారం ( జనవరి 25) అర్ధరాత్రి కొచ్చి నుంచి చెన్నై వెళ్తున్న ఇండిగో విమానంలో ఈ వింత ఘటన జరిగింది. 171 మంది ప్రయాణికులతో చెన్నై వెళ్తున్న



విమానంలో టేకాఫ్ అయిన కొద్ది సేపటికే ఇద్దరు ప్రయాణికుల మధ్య వాగ్వాదం జరిగింది. అమెరికన్, కేరళకు చెందిన మరోవ్యక్తి సీటు విషయంలో గొడవపడ్డారు.. ఇద్దరి మధ్య గొడవ పెరిగి కొట్టుకున్నారు. అంతటితో ఆగ కుండా నా దగ్గర బాంబు అంటే..నా దగ్గర బాంబు ఉంది అంటూ పేల్చేస్తామని బెదిరించుకున్నారు..దీంతో తోటి ప్రయాణి కులు భయంతో వణికిపోయారు. చివరగా ఆదివారం తెల్లవారు జామున చెన్నై విమానాశ్రయంలో ల్యాండ్ అయిన తర్వాత ఎయిర్ పోర్టు సెక్యూరిటీ అధికారులు విమానం మొత్తం చెక్ చేసి బాంబు లేదని చెప్పారు. ఇక ఘటనకు కారణమమైన ఇద్దరు ప్యాసింజర్లు తదుపరి విచారణ కోసం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# సిగరేట్ మానేయడానికి ఏం చేశాడో తెలుసా.?



**హైదరాబాద్ పెన్ పవర్:**స్మోకింగ్ ఆరోగ్యానికి హానికరమని తెలిసినా.. చాలామంది మానలేకపోతుంటారు. ఏళ్ల తరబడి ఉన్న అలవాటుని మార్చుకోవడం అంత ఈజీ కాదు. అందుకే స్మోకింగ్ ఆపేందుకు ప్రయత్నాలు చేసినప్పటికీ చాలామంది ఫెయిల్ అవుతుంటారు. అందుకు అపారమైన సంకల్ప బలం, అంకితభావం ఉండాలి. అయితే.. పదకొండేళ్ల క్రితం టర్కీకి చెందిన ఇబ్రహీం యాసెస్ సిగరెట్ మానేయడానికి తలకు పంజరం ఆకారంలో ఉన్న మెటల్ హెల్మెట్ కేజ్ పెట్టుకుని మరీ ప్రయత్నించాడు. అతను అప్పటికే దాదాపు 26 ఏళ్లపాటు స్మోకింగ్ చేశాడు. 2013 వరకు యుసెల్ రోజుకు రెండు ప్యాకెట్ల సిగరెట్లు తాగేవాడు. అతని ఆరోగ్యం పట్ల కుటుంబీకులు ఆందోళన చెందడంతో యూసెల్ ఆ అలవాటు మానేయడానికి ఎన్నో ప్రయత్నాలు చేశాడు. ప్రతి సంవత్సరం అతని మ్యారేజ్ యానివర్సరీ, ముగ్గురు పిల్లల పుట్టినరోజులప్పుడు సిగరెట్ తాగడం మానేస్తానని ప్రతిజ్ఞ చేసేవాడు. కానీ.. కొన్ని రోజులకు కథ మళ్లీ మొదటికి వచ్చేది.

ఇప్పటికీ అతను సిగరెట్ మానేశాడా? లేదా? అనేది తెలియదు. కానీ.. పదకొండేళ్ల క్రితం తీసిన అతను కేజ్ పెట్టుకున్న ఫొటోలు ఇప్పుడు ఇంటర్నెట్ లో వైరల్ అవుతున్నాయి. ఎందుకంటే.. కొన్నాళ్ల క్రితం 'నాన్ ఈస్తటిక్ థింగ్స్' అనే ట్విట్టర్ పేజీలో ఆ ఫొటోలు షేర్ చేయడంతో నెటిజన్స్ అతని గురించి సెర్చ్ చేయడం మొదలుపెట్టారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. ప్రతి సంవత్సరం 8 మిలియన్ల కంటే ఎక్కువ మంది స్మోకింగ్ వల్ల చనిపోతున్నారు. సెకండ్ హ్యాండ్ స్మోకింగ్ వల్ల ఎంతోమంది అనారోగ్యం పాలవుతున్నారు. దీనివల్ల ఏటా 1.2 మిలియన్ల మంది చనిపోతున్నారు. అందులో 65వేల మంది పిల్లలే.